


జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

# ఆదిలాబాద్

## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

ఆదివారం 24 మే 2026 పేజీలు : 8


# పేదలకు గౌరవ నివాసం కల్పిస్తాం



## ప్రభుత్వ బడిలో కార్పొరేట్ స్థాయి

# సదుపాయాలు

- ప్రతి రోజు బడికి వచ్చేలా ప్రత్యేక చర్యలు
- విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ప్రభుత్వ బడి ప్రధానోపాధ్యాయులు








## అంతర్జాతీయ పరిణామాల

# నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగింది



- వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలి
- ముందస్తు జాగ్రత్త చర్యలను సత్వరమే తీసుకోవాలి

# జల సంజయ్ జన భాగీ దారి నీ అధికారులు విజయవంతం చేయాలి



## ధైర్యంగా ముందుకు రావాలి

**మహిళలకు జడ్జి సంకేత్ మిత్ర పిలుపు**




**ఆసిఫాబాద్ మే 23 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బంబార గ్రామ పంచాయతీలో మహిళలకు అవగాహన సదస్సు శనివారం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి సంకేత్ మిత్ర మాట్లాడుతూ మహిళల హక్కులు, బాల్య వివాహాల నివారణ, వ్యభిచారం వల్ల కలిగే నష్టాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని, చట్టపరమైన రక్షణలను వినియోగించు కోవాలని సూచించారు.జూనియర్ సివిల్ జడ్జి జక్కుల అనంతలక్ష్మి, అంజనాదేవి పాల్గొని మహిళలకు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెందరే కృష్ణాజీ, ఉపసర్పంచ్ సంతోష్, వార్డు సభ్యులు లోహబడే ఉమేష్, కోట్నాక రాంశవ్, డోకె బందు, ఆకారపు శైలేష్, డీహెచ్ఈడబ్ల్యు జీఎస్ శారద, జెండర్ స్పెషలిస్ట్ బైరాగి రాణి, నిర్మల, సలక్కతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సదస్సు మహిళల్లో చైతన్యం పెంపొందించడంలో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు.

## గంజాయి నిర్మూలనకు పోలీసుల ప్రత్యేక దాడులు

**యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : సీఐ నవీన్ కుమార్**



**జైపూర్ మే 23 ప్రజాజ్యోతి** జైపూర్ మండల పరిధిలో గంజాయి మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు.స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్ స్టాండ్ తో పాటు ఇందారం చౌరస్తా ఆటో స్టాండ్ ప్రాంతాలతో పాటు పాన్ షాపులు హోటళ్లు టీ స్టాళ్లలో శనివారం సోదాలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో జైపూర్ సీఐ నవీన్ కుమార్,ఎస్ఐ భూమేష్,మంచిర్యాల నార్కోటిక్ టీమ్, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ పాల్గొన్నారు.ప్రజలు అధికంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి రహిత రామగుండం కమిషనరేట్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.యువత గంజాయి,డ్రగ్స్ బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను వినియోగించినా విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహితుల వివరాలు అలవాట్లపై నిఘా ఉంచాలని సూచించారు. అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.తనిఖీల సందర్భంగా పలు పాన్ షాపులు, హోటళ్లలో నార్కోటిక్ డాగ్ సహాయంతో ముమ్మరంగా సోదాలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

## టీజీ పాలీసెట్ ఫలితాల్లో "స్టేట్ ప్రథమ" ర్యాంకు సాధించిన స్లేట్ విద్యార్థిని.

**అభినందించిన స్లేట్ విద్యాసంస్థల ఛైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి**




**జన్నారం,మే23(ప్రజాజ్యోతి)** శనివారం రోజు విడుదలైన టీజీ పాలిసెట్ 2026 ఫలితాల్లో జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ పాఠశాలకు చెందిన అల్వియా షిఫాలి స్టేట్ ప్రథమ ర్యాంక్ సాధించినట్లు స్లేట్ విద్యాసంస్థల ఛైర్మెన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ శనివారం విడుదలైన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అల్వియా షిఫాలి ఎంపీసీ విభాగంలో 120 మార్కులకు గాను 120 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ కైవసం చేసుకుందని, అలాగే ఎంబైపీసీ విభాగంలో రాష్ట్ర 25వ ర్యాంకు సాధించిందని ఆయన తెలిపారు. స్టేట్ ప్రథమ ర్యాంకు సాధించిన అల్వియా షిఫాలీ మొదటి నుండి ఎంతో క్రమశిక్షణ, పట్టుదలతో చదివేదని, టెన్త్‌లో మండల టాపర్‌గా నిలవడమే కాకుండా, ఇప్పుడు పాలిసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడం తమ పాఠశాలకే కాక మంచిర్యాల జిల్లా మొత్తానికి గర్వకారణం" అని కొనియాడారు. విద్యార్థినిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను వారు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో అల్వియా షిఫాలీ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరిన శ్రీనివాస్ రాంటెంకి



**మంచిర్యాల, 23,మే (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ సభ్యత్వాన్ని మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రాంటెంకి స్వీకరించారు. పార్టీ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న మరియు పార్టీ రాష్ట్ర నాయకులు కొమ్ముల ప్రవీణ్ రాజ్ చేతుల మీదుగా సభ్యత్వ పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీ అని అన్నారు. రాష్ట్రంలో సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం, యువతకు న్యాయం చేయడం, సామాజిక మార్పు తీసుకురావడం పార్టీ ప్రధాన లక్ష్యాలని తెలిపారు.కొమ్ముల ప్రవీణ్ రాజ్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. ప్రజల విశ్వాసంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మరింత బలపడుతుందని అన్నారు.శ్రీనివాస్ రాంటెంకి మాట్లాడుతూ, తీన్మార్ మల్లన్న నాయకత్వానికి ఆకర్షితుడై పార్టీ సభ్యత్వం తీసుకున్నానని, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీతో కలిసి పనిచేస్తానని తెలిపారు.

## బ్రహ్మశ్రీ మియాపురం వీరాచారికి అఖిల్ భారతీయ విశ్వకర్మ మహాసభలో కీలక పదవి



**మంచిర్యాల, 23,మే (ప్రజాజ్యోతి):** అఖిల్ భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు మరియు జిల్లా సలహాదారుగా మంచిర్యాల జిల్లాకు చెందిన బ్రహ్మశ్రీ మియాపురం వీరాచారిని నియమించారు. రాష్ట్ర అధ్యక్షులు నొండ్ల సంతోష్ చారి తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రహ్మశ్రీ మియాపురం వీరాచారి ఎన్నో సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, ఆపదలో ఉన్న అనేక మందికి సహాయ సహకారాలు అందించి విశ్వకర్మ సమాజంలో మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సమాజ సేవను మరింత విస్తృతంగా కొనసాగించాలనే ఉద్దేశంతో ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన బ్రహ్మశ్రీ మియాపురం వీరాచారికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశ్విని కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ సుభాష్ చంద్రబోస్, జాతీయ వ్యవహారాల అధ్యక్షులు బ్రహ్మశ్రీ రామ్ రాజ్, జాతీయ యువజన విభాగం అధ్యక్షులు బ్రహ్మశ్రీ దిలీప్ కుమార్ శర్మ, జాతీయ అడ్వైజరీ కమిటీ సభ్యులు బ్రహ్మశ్రీ చిన్మయ చారి తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## ఎఫ్‌పీఎస్--1971 స్కీం వితంతువులకు ఒక వెయ్యి కనీస పెన్షన్ అమలు

**లక్ష్మారెడ్డి కృషితో కేంద్రం గెజిట్ విడుదల**

**హర్షం వ్యక్తం చేసిన సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (బీఎంఎస్) నాయకులు**

**మంచిర్యాల, 23, మే (ప్రజా జ్యోతి):** బీఎంఎస్ నాయకులు, కోల్ సెక్టార్ ఇన్‌చార్జ్, సిఎంపిఎఫ్ఓ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి కృషి ఫలితంగా బొగ్గుగనుల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలకు కనీస పెన్షన్ రూ.1,000 అమలు కానుందని సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (బీఎంఎస్) అడ్వైజర్ పులిరాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. రమాకాంత్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్--1971 ప్రకారం పదవీ విరమణ పొందిన కార్మికులకు కనీస పెన్షన్ రూ.1,000 అందుతున్న విషయం తెలిసిందేనన్నారు. అయితే వాలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) ద్వారా పదవీ విరమణ పొంది అనంతరం మృతిచెందిన మాజీ కార్మికుల భార్యలు, వితంతువుల కు కనీస పెన్షన్ అమలు కావడం లేదని గత సంవత్సరం జరిగిన పెన్షన్ స్కీమ్ సమావేశంలో లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు .దీనిపై స్పందించిన లక్ష్మారెడ్డి బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో సమస్యను ప్రస్తావించి కృషి చేయడంతో ఎఫ్‌పీఎస్--1971లో ఉన్న సభ్యులందరికీ కనీస పెన్షన్ చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం జీఎస్ఆర్ 370(ఇ), తేదీ 15,మే 2026 న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ గెజిట్ ప్రకారం బొగ్గుగనుల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికుల భార్యలకు కనీస పెన్షన్ రూ.1,000ను 2024 మార్చి 8 నుంచి అమలు చేస్తూ చెల్లించనున్నట్లు తెలిపారు. అలాగే 24 నెలల బకాయిలు కూడా అందనున్నాయని వివరించారు. వితంతు పెన్షన్‌ను వెయ్యికి పెంచేందుకు కృషి చేసిన కొత్తకాపు లక్ష్మారెడ్డికి పెన్షనర్లు కృతజ్ఞతలు తెలిపారు.

## వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ గుండేటి నాందేవ్



**మంచిర్యాల, 23,మే (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ బాలాజీ స్కూల్ ఆర్కే--6 గుడిసెల ప్రాంతంలో శనివారం హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ) డాక్టర్ గుండేటి నాందేవ్ నాయకత్వం వహించారు. ఏఎన్ఎం త్రివేణి మరియు ఆశా వర్కర్లు పాల్గొని ప్రజలకు వేసవి తీవ్రత, వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఎండలో తిరిగే చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువగా నీరు తాగాలని, మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని డాక్టర్ నాందేవ్ సూచించారు. అలాగే ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి హెల్త్ డిపార్ట్మెంట్ ద్వారా అందించిన ఓఆర్ఎస్ (ఒరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్) ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 4వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్ ఎ ఎన్ ఎం లు త్రివేణి . ఆశా వర్కర్లు ఆడపు శ్యామల కే స్వర్ణలతబి . శ్రీదేవి జే . భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మురళీ మెమోరియల్ క్రికెట్ అకాడమీ నూతన వేదికను ప్రారంభించనున్న ఎమ్మెల్యే వినోద్



**మంచిర్యాల, 23,మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన శ్రీ మురళీ మెమోరియల్ క్రికెట్ అకాడమీ నూతన వేదికను బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ సోమవారం ప్రారంభించ నున్నట్లు అకాడమీ నిర్వాహకులు శనివారం తెలిపారు.గత సంవత్సరం నుంచి బెల్లంపల్లిలో ఈ క్రికెట్ అకాడమీ నిర్వహణకొనసాగు తున్నప్పటికీ, పాత స్థలం ఇరుకుగా ఉండటంతో క్రీడాకారులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నూతన స్థలాన్ని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన వేదిక విశాలంగా ఉండటంతో శిక్షణ పొందే క్రీడాకారులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపారు.ఇప్పటివరకు అకాడమీ ద్వారా అనేక మంది యువ క్రీడాకారులకు శిక్షణ అందించడంతో పాటు, వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లలో పాల్గొనే అవకాశాలు కల్పించినట్లు వెల్లడించారు. అకాడమీ విద్యార్థులు పలు పోటీల్లో ప్రతిభ కనబరిచి బెల్లంపల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చారని నిర్వాహకులన్నారు.నూతన వేదిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, క్రీడాభిమానులు పాల్గొననున్నట్లు అకాడమీ నిర్వాహకులు అల్లం వెంకటేశ్వర్లు తెలిపారు.

# అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగింది

**వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలి**

**ముందస్తు జాగ్రత్త చర్యలను సత్వరమే తీసుకోవాలి**

**అన్ని ఏరియాల జీఎంలకు సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం**




**మంచిర్యాల , మే 23 (ప్రజా జ్యోతి):** సింగరేణిలో వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలని, ముందస్తు జాగ్రత్త చర్యలను సత్వరమే తీసుకోవాలని అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగినందున థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు అన్ని ఏరియాల యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్ని ఏరియాల జీఎంలకు సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు జారీ చేశారు . నైరుతి రుతుపవనాలు మరో పది రోజుల్లో ప్రవేశించే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో వర్షాకాలంలో కూడా బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు. సింగరేణి భవన్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన వర్షాకాల సన్నద్ధతపై విస్తృతంగా చర్చించారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 95 శాతం ఓపెన్ కాస్ట్ గనుల నుంచే వస్తోందని, భారీ వర్షాల సమయంలో గనుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల ఉత్పత్తికి ఆటంకం కలిగే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన భారీ పంపులు, మోటార్లతో పాటు అవసరమైతే ప్రైవేటు పంపులను కూడా వినియోగించి ఓవర్ బర్డెన్, బొగ్గు బెంచీల వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. హాల్ రోడ్లను పటిష్టపరచడంతో పాటు తగినన్ని పంపులు సమకూర్చుకునేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కార్పొరేట్ కార్యాలయ అధికారులకు సూచించిన సీఎండీ, వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న గనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. గత రెండేళ్లలో వర్షాల కారణంగా ఉత్పత్తి నష్టపోయిన గనులపై ఈసారి మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఏరియా జీఎంలకు స్పష్టం చేశారు. స్థానిక వాతావరణ శాఖ హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగినందున థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు అన్ని ఏరియాల యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సాధించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపు అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు గరిష్ట స్థాయిలో బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. కొన్ని ప్రధాన ఓపెన్ కాస్ట్ గనులు లక్ష్యాలను చేరుకోలేకపోవడానికి గల కారణాలపై లోతుగా చర్చించిన సీఎండీ, భారీ యంత్రాల పనిగంటలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవా లని సూచించారు. మానవ వనరులను సమర్థంగా వినియోగిస్తూ సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను కార్మికులకు వివరించి ప్రతి ఉద్యోగి సంస్థ అభివృద్ధికి కృషి చేసేలా చైతన్యం కల్పించాలని కోరారు. సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారా యణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్ అండ్ ఫైనాన్స్ గౌతమ్ పోట్రు, డైరెక్టర్ ఈ అండ్ ఎమ్ ఎం. తిరుమలరావు, ఈడీ కోల్ మూమెంట్ బి. వెంకన్న, జీఎం కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్ టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు గౌరవ నివాసం కల్పిస్తాం

ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ పరిశీలనలో మండల అధ్యక్షుడు



**ఆసిఫాబాద్ మే 23 ప్రజా జ్యోతి** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని కాంగ్రెస్ పార్టీ వాంకిడి మండల అధ్యక్షుడు నారాయణ పేర్కొన్నారు. వాంకిడి మండలం ఖమన గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను నారాయణ శుక్రవారం పరిశీలించారు. ఖమనకు చెందిన మొహర్లే భాగ్యశ్రీ-గంగాధర్ దంపతుల ఇంటి స్లాబ్ పనులను దగ్గరగా పరిశీలించి నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హులైన పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు గౌరవప్రదమైన నివాస వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డు పేరుతో కార్మికులను మోసం చేస్తున్నారు

**టీబీజీకేఎస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి**




**మంచిర్యాల, 23, మే (ప్రజా జ్యోతి):** సింగరేణిలో మెడికల్ బోర్డు ప్రారంభమైందంటూ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులను మోసం చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నాయని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి విమర్శించారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధించి మంత్రులు, సీఎండీ, అధికారులను కలిశామని చెబుతూ పాత ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 23న నిర్వహించే మెడికల్ బోర్డు విషయంలో కూడా "నేనే పెట్టించాను" అంటూ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు గొప్పలు చెప్పుకుంటున్నాయని అన్నారు. అయితే ఇది రెగ్యులర్ మెడికల్ బోర్డు కాదని, మూడున్నర సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న 32 మంది కార్మికులకు సంబంధించిన ప్రత్యేక బోర్డు మాత్రమేనని తెలిపారు. రెండు సంవత్సరాల కిందట దరఖాస్తు చేసుకున్న వారందరినీ పిలిచే విధంగా రెగ్యులర్ మెడికల్ బోర్డు నిర్వహించాలని కార్మికులు కోరుకుంటున్నారని చెప్పారు. కానీ ఇదే రెగ్యులర్ బోర్డు అంటూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కొత్త బావుల పేరుతో ప్రభుత్వం, గుర్తింపు సంఘాలు కార్మికులను మభ్యపెడుతున్నాయని, ప్రస్తుతం వచ్చినవి పాత గనుల విస్తరణ అనుమతులేనని పేర్కొన్నారు. కొన్ని అనుమతులు గతంలోనే వచ్చినప్పటికీ వాటినే కొత్త బావులుగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని కార్మికులు, యువత గమనించాలని కోరారు. మారుపేర్ల సమస్యను కూడా తీవ్ర జాప్యం చేస్తూ లీగల్ ఒపీనియన్ పేరుతో తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. పదో తరగతి పాస్ కాని డిపెండెంట్లను విజిలెన్స్ పేరుతో వేధించే సర్క్యులర్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# డీఆర్ అనుసంధానం సహా పెన్షనర్ల సమస్యలు పరిష్కారం వరకు ఉద్యమం కొనసాగుతుంది

**2024 పెన్షన్ సవరణలో లోపాలను సరిదిద్దాల్సి వచ్చినదే మా పోరాట విజయానికి నిదర్శనం**

**ఏఐఏసీఈ, ఏఐసీపీఏ కన్వీనర్ పి.కె. సింగ్ రాథోర్**




**మంచిర్యాల, మే 22 (ప్రజాజ్యోతి):** కోల్ పెన్షనర్ల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏఐఏసీఈ, ఏఐసీపీఏ కన్వీనర్ పి.కె. సింగ్ రాథోర్ తెలిపారు. సమగ్ర పెన్షన్ సంస్కరణలు, వాస్తవిక కనీస పెన్షన్, డీఏ/డీఆర్ అనుసంధానం, సామాజిక భద్రత సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.కోల్ మైన్స్ ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్-1971 పరిధిలో ఉన్న పెన్షనర్లకు కనీస పెన్షన్‌ను నెలకు వెయ్యి గా సవరించే విషయమై కేంద్ర ప్రభుత్వం 2026 మే 15న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ కోల్ ఎగ్జిక్యూటివ్స్ (ఏఐఏసీఈ), ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏఐసీపీఏ) సంయుక్తంగా స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు . 2024 మార్చి 8న ప్రభుత్వం జారీ చేసిన పెన్షన్ సవరణ అమలులో అనేక అస్పష్టతలు, వివక్షతలు ఉన్నాయని, ముఖ్యంగా 1971- కుటుంబ పెన్షన్ పథకంలోని పాత పెన్షనర్లకు సమానంగా అమలు జరగడం లేదని గత కొన్ని నెలలుగా కేంద్ర ప్రభుత్వం, సీఎంపీఎఫ్‌వో అధికారులు, సంబంధిత మంత్రిత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కనీస పెన్షన్ పెంపు ప్రకటించినప్పటికీ, 1971 పథకంలోని అనేక మంది లబ్ధిదారులకు సరైన అమలు జరగకపోవడం, స్పష్టమైన చట్టపరమైన నిబంధనలు లేకపోవడం వల్ల అనిశ్చితి నెలకొన్నదన్నారు. ఈ అంశాలపై ఏఐఏసీఈ, ఏఐసీపీఏ సంఘాలు పదేపదే వినతులు, ప్రాతినిధ్యాలు సమర్పించాయని, ప్రభుత్వం బహిరంగంగా చట్టపరమైన, పరిపాలనా సమస్యలను అంగీకరించకపోయినా తాజా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అమలులో ఉన్న సందిగ్ధతలను తొలగించేందుకు ప్రత్యేక సవరణ అవసరమైందని స్పష్టమైందన్నారు.తాజా సవరణ ద్వారా కోల్ మైన్స్ ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్-1971 లబ్ధిదారులకు గత సవరణలో తగిన రక్షణ లేకపోయిన విషయం బయటపడిందని, పరిపాలనా, ఆడిట్ సంబంధిత సమస్యలు సమాన అమలుకు అడ్డంకిగా మారిన విషయం స్పష్టమైందని తెలిపారు. ఏఐఏసీఈ, ఏఐసీపీఏ నిరంతర పోరాటం కారణంగానే ప్రభుత్వం కొత్త చట్టబద్ధ నోటిఫికేషన్ ద్వారా లోపాలను సరిదిద్దాల్సి వచ్చిందని తెలిపారు .ముఖ్యంగా ప్రభుత్వం ఈ సవరణను 2024 మార్చి 8 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పూర్వవ్యతిరేక ప్రభావంతో అమలు చేయడం ద్వారా అప్పటి నోటిఫికేషన్‌లో లోపాలు ఉన్నాయని పరోక్షంగా అంగీకరించినట్లైందని పి.కె. సింగ్ రాథోర్ తెలిపారు. ఈ పరిణామం కోల్ పెన్షనర్ల నైతిక, సంఘటిత విజయమని అన్నారు . పెన్షన్ పెంపుతో పాటు డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) అనుసంధానం సహా పెన్షనర్ల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అయన స్పష్టం చేశారు.

## పంచాయతీ స్పందన..

## సమస్యకు పరిష్కారం

**నెలలుగా పెండింగ్‌లో ఉన్న బోరు పునరుద్ధరణ**



**ఆసిఫాబాద్ మే 23 (ప్రజా జ్యోతి)** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కనర్‌గాం పంచాయతీ పరిధిలో గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న బోరుకు మరమ్మతులు పూర్తిచేశారు. సర్పంచ్ కొట్నాక్ భీంరావ్, ఉప సర్పంచ్ జీవన్ ఆధ్వర్యంలో శనివారం బోరు మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామంలో తాగునీటి సమస్య తీర్చేందుకు పెండింగ్ బోరు పనులు పూర్తి చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతామని సర్పంచ్ భీంరావ్ తెలిపారు.

## గోమాత సంరక్షణ కోసం 15 వేల కిలోమీటర్ల పాదయాత్ర

**మంచిర్యాలకు చేరుకున్న జాదవ్ మాధవరావు**



**మంచిర్యాల, 23,మే (ప్రజా జ్యోతి):**గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని, దేశవ్యాప్తంగా గోమాత సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుని జాదవ్ మాధవరావు చేపట్టిన మహా పాదయాత్ర ప్రస్తుతం మంచిర్యాలకు చేరుకుంది. నిర్మల్ జిల్లా కుబీర్ గ్రామం నుండి ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన ఈ యాత్ర దేశంలోని 12 జ్యోతిర్లింగాలు, చార్‌ధామ్ క్షేత్రాలు, పూరి జగన్నాథ్ దేవాలయం వరకు సుమారు 15 వేల కిలోమీటర్ల మేర కొనసాగనుంది.పాదయాత్రలో భాగంగా మాధవరావు శనివారం మంచిర్యాల లోని మాధవ సేవ సమితి మరియు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం కార్యాలయాలను సందర్శించి అక్కడ విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, గోభక్తులు, సామాజిక కార్యకర్తలు ఆయనను కలిసి అభినందించారు. గోమాత భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీక అని, గోవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జాదవ్ మాధవరావు అన్నారు. గోవధ నిషేధానికి కఠిన చట్టాలు అమలు చేయాలని, దేశవ్యాప్తంగా గోశాలలకు ప్రభుత్వ ప్రోత్సాహం పెంచాలని ఆయన కోరారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గోవుల పాత్ర ఎంతో ముఖ్యమని, సేంద్రియ వ్యవసాయం, పాలు, పాడి పరిశ్రమల అభివృద్ధికి గోసంరక్షణ అవసరమని తెలిపారు.ఈ పాదయాత్ర ద్వారా యువతలో ఆధ్యాత్మికత, సంస్కృతి, గోసేవపై అవగాహన పెంపొందించడం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. యాత్రకు వివిధ ప్రాంతాల ప్రజలు స్వచ్ఛందంగా సహకారం అందిస్తూ మాధవరావుకు మద్దతు తెలుపుతున్నారు. గోమాత సంరక్షణ కోసం చేపట్టిన ఈ విశిష్ట యాత్ర విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షించారు.

## సీఎం రేవంత్ రెడ్డి సభ సక్సెస్ చేయాలి

**కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన సుగుణక్క**



**ఆసిఫాబాద్ మే 23 ప్రజా జ్యోతి** జూన్ 2న జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. శనివారం వాంకిడి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరై సభ ఏర్పాట్లపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సీఎం సభకు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా పనిచేసి సభను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో యువజన అధ్యక్షులు కృష్ణ, టౌన్ అధ్యక్షుడు మండోకర్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు గణేష్, అనిల్, జంబుల్‌ధరి సర్పంచ్ పవన్, కనర్‌గాం సర్పంచ్ కే.భీంరావు, సమేల సర్పంచ్ సంతోష్, బెండర అన్నారావు సర్పంచ్ మొహర్లే రమేష్, డోదిగూడ సర్పంచ్ నాగోరావు, ఉప సర్పంచ్ భీంరావు, కనర్‌గాం ఉప సర్పంచ్ జీవన్, ఖిర్డీ సర్పంచ్ కొట్నాక అమృత, కొడప మారుతీ, గుర్నులే మెంగజి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తాం

**బాధితులను హైదరాబాద్ తీసుకెళ్తామన్న రాథోడ్ రమేష్**



**ఆసిఫాబాద్ మే 23 ప్రజా జ్యోతి** ముఖదం గుడా: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ముఖ దంగుడా గ్రామపంచా యతీ మహారాజుగూడా లో ఒకే కుటుంబంలో ముగ్గురు వికలాంగులు ఉండటంతో ఎన్‌హెచ్ ఆర్‌సీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ శనివారం బాధితులను పరామర్శించారు. ఆడే శేషారావు మానసిక వికలాంగుడు కాగా, భార్య మాయాబాయి వినికిడి సమస్యతో, కుమారుడు పవన్ కంటి చూపు సమస్యతో బాధపడుతున్నారని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు, సర్పంచ్ తో మాట్లాడి బాధితులను హైదరాబాద్ తీసుకెళ్లి సంబంధిత డాక్టర్ల ద్వారా వికలాంగ ధ్రువీకరణ పత్రాలు ఇప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రాథోడ్ రమేష్ మాట్లాడుతూ బాధితుల పక్షాన నిలబడి త్వరలోనే వికలాంగుల ధ్రువీకరణ పత్రాలు అందించేలా చొరవ తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నుంచి ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున పెన్షన్ వచ్చేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అభాగ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## సుర్దాపూర్ నూతన బోర్‌వెల్ ఏర్పాటు

**సర్పంచ్ రాధాబాయి చొరవ : నీటి కష్టాలు తీరాయని గిరిజనుల హర్షం**




**కెరమెరి,మే 23 ప్రజా జ్యోతి** కెరమెరి మండలం సూర్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 6వ వార్డు గోండుగూడలో నూతన బోర్‌వెల్‌ను సర్పంచ్ కుర్రెంగా రాధాబాయి శనివారం ఏర్పాటు చేయించారు. గిరిజన కాలనీ అయిన గోండుగూడలో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తుండటంతో విషయాన్ని గుర్తించిన సర్పంచ్ రాధాబాయి వెంటనే స్పందించారు. గ్రామ పంచాయతీ నిధులతో బోర్‌వెల్ తవ్వించి గిరిజనుల దాహార్తి తీర్చారు. బోర్‌వెల్ నుంచి నీరు పడటంతో గూడెం వాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ప్రతి గూడెంలో మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని సర్పంచ్ రాధబాయి తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామ కార్యదర్శి తరుణ్ గౌడ్ కారొబార్, రఫీక్, కుర్సెంగా దంధు మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## విశ్వనాథ రాజుకు ఘన వీడ్కోలు

### సింగరేణిలో 38 ఏళ్ల సేవలకు అధికారుల ప్రశంసలు

**జైపూర్, మే 23: ప్రజా జ్యోతి** సింగరేణి సంస్థలో 38 సంవత్సరాలుగా వివిధ ఏరియాల్లో పలు కీలక హోదాల్లో సేవలందించి మే నెలలో పదవీ విరమణ పొందుతున్న ఎండి ఆప్మెల్ (ఏ పి హెచ్ ఎం ఈ ఎల్) ఎన్‌వి.కే విశ్వనాథ రాజును శుక్రవారం జైపూర్ ఎస్టిపిపి పరిపాలనా భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఈడి ఎస్టిపిపి సిహెచ్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడి చిరంజీవి మాట్లాడుతూ ఎస్టిపిపి తొలి దశ 2x600 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం, ఆపరేషన్‌లోకి తీసుకురావడంలో విశ్వనాథ రాజు కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న రెండో దశ 1x800 మెగావాట్ల ప్రాజెక్టులో కూడా ఆయన విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. చీఫ్ ఆఫ్ పవర్ ప్రాజెక్ట్స్ డివిజన్ (పి పి డి)గా పనిచేసిన సమయంలో ఎస్టిపిపిలో ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను కేంద్ర విద్యుత్ అథారిటీ, విద్యుత్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు బహిరంగ మార్కెట్లో విక్రయించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ వద్ద ప్రతిపాదిత 3x800 మెగావాట్ల ప్లాంట్‌కు సంబంధించిన డ్రాఫ్ట్ పీఎఫ్ఆర్ సిద్ధం చేయడంలోనూ రాజస్థాన్ ప్రభుత్వంతో కలిసి సింగరేణి సోలార్ ప్లాంట్ల నిర్మాణ ఒప్పందాల రూపకల్పనలోనూ ఆయన సేవలు విశేషమని తెలిపారు. ఎస్టిపిపిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఎఫ్‌జీడీ ప్లాంట్ పనుల్లో కూడా విశ్వనాథ రాజు సాంకేతిక సహకారం




అందించారని చెప్పారు. అలాగే ఆప్మెల్ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంస్థకు సుమారు రూ.30 కోట్ల లాభాలు తీసుకువచ్చి తక్కువ కాలంలోనే అభివృద్ధి దిశగా నడిపించారని అభినందించారు. ఈ మేరకు ఇతర అధికారులు మాట్లాడుతూ విశ్వనాథ రాజు నిరంతర శ్రామికుడు మృదుస్వభావి అందరితో స్నేహపూర్వకంగా మెలిగే వ్యక్తి అని పేర్కొన్నారు. సంస్థకు అవసరమైన పనులను సమర్థవంతంగా పూర్తి చేయడంలో ఆయన నైపుణ్యం కలిగిన అధికారిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎం ఎం. నరసింహారావు, జీఎం (పీసీఎస్ – ఓ అండ్ ఎం) ఎం. మదన్‌మోహన్,డీజీఎంలు ఎం.వి. వేణుగోపాలరావు,సంతోష్ కుమార్,బ్రహ్మం,జనగామ శ్రీనివాస్, డీజీఎం (ఎఫ్‌జీడీ) పి.మహేందర్,డీజీఎం (పర్సనల్) కిరణ్‌బాబు, ఎస్ఈ (సివిల్) రాము తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గౌరవ వేతనం పెంచాలంటూ వీవోఏల ఆందోళన

**ఆరో రోజుకు చేరిన నిరవధిక సమ్మె**




**జైపూర్, మే 23: ప్రజా జ్యోతి** వేతనం పెంపు ఉద్యోగ భద్రత హెచ్‌ఆర్ పాలసీ అమలు తదితర డిమాండ్ల సాధన కోసం విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీవోఏలు) చేపట్టిన నిరవధిక సమ్మె జైపూర్ మండలంలో శనివారం ఆరో రోజుకు చేరుకుంది. మహిళా సంఘాల కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తున్న తమకు ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వడం లేదని వీవోఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ వేతనాలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని విధుల నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో భవిష్యత్తుపై ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వీవోఏల సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే నెలకు రూ.26 వేల గౌరవ వేతనం అమలు చేయాలని హెచ్‌ఆర్ పాలసీ తీసుకురావాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు కల్పించి పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమ్మె కార్యక్రమం లో స్వప్న,కవిత,పద్మ, సుజాత,వజ్ర, సునీత, వెంకటలక్ష్మి,లలిత,భీమరాజు,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్థ మనుగడే లక్ష్యం... సమిష్టి కృషితో నిర్దేశిత ఉత్పత్తి సాధిద్దాం





### శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పిలుపు

### ముగిసిన మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు

**మంచిర్యాల, మే 23 (ప్రజా జ్యోతి):** సంస్థ మనుగడే లక్ష్యం అని, సమిష్టి కృషితో నిర్దేశిత ఉత్పత్తి సాధిద్దామని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ శనివారం పిలుపు నిచ్చారు. సింగరేణి సంస్థ వాస్తవ పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు, భవిష్యత్ ప్రణాళికలు, సంస్థ మనుగడ కోసం అనుసరించాల్సిన విధానాలపై క్షేత్రస్థాయిలో ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు యాజమాన్యం చేపట్టిన మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు శ్రీరాంపూర్ ఏరియాలో శనివారంతో ముగిశాయి. గత వారం రోజులుగా ఏరియా పరిధిలోని అన్ని గనులు, కార్యాలయాలు, విభాగాల్లో ఈ సమావేశాలు నిర్వహించగా, శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ స్వయంగా పాల్గొని ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఆర్కే-7 భూగర్భ గని, జీఎం కార్యాలయంలో రెండు బృందాల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సమావేశాలు శనివారం సివిల్ విభాగం ఉద్యోగులు, ఎస్ పీసీ విభాగ సిబ్బందికి అవగాహన కల్పించడంతో ముగిశాయి. చివరి రోజు టీమ్-1 ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా వ్యాప్తంగా ఉద్యోగుల నివాస సముదాయాలు, గనులు, ఇతర కార్యాలయాల్లో సివిల్ పనులు నిర్వహిస్తున్న అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులతో పాటు భద్రతా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఎస్ అండ్ పీసీ విభాగ సిబ్బందికి సంస్థ స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై వివరించారు. ఈ సందర్భంగా మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ కన్వీనర్, ఎస్వోటూ జీఎం ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ, సంస్థ ఉద్యోగులకు కల్పిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు సమర్థంగా అమలయ్యేలా చూడటంలో సివిల్ విభాగం ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. సంస్థకు సివిల్, ఎస్ అండ్ పీసీ విభాగాలు రెండు కళ్లలాంటివన్నారు. సంస్థ ఆస్తుల పరిరక్షణలో భద్రతా విభాగం సేవలు కీలకమని, పారిశుద్యం, నివాస సముదాయాల నిర్వహణ, స్వచ్ఛత పరిరక్షణలో సివిల్ విభాగం సేవలు ఎంతో ముఖ్యమని తెలిపారు. గత వారం రోజులుగా జరిగిన అన్ని సమావేశాల్లో జీఎం మునిగంటి శ్రీనివాస్ పాల్గొని సింగరేణి సంస్థ, ముఖ్యంగా శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకతలో ఉన్న లోటుపాట్లు, ఆర్థిక స్థితిగతులు, సంస్థ భవిష్యత్ కోసం చేపట్టాల్సిన చర్యలపై ఉద్యోగులకు సమగ్రంగా వివరించారు. 137 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రభుత్వ రంగ సంస్థగా ని.లిచిందని తెలిపారు. ప్రపంచంలో మరే సంస్థ అందించని విధంగా సంక్షేమ కార్యక్రమాలు, లాభాల బోనస్ అందిస్తున్న ఏకైక సంస్థ సింగరేణి అని ఉద్యోగులకు వివరించారు. “కన్నతల్లి లాంటి ఈ సింగరేణి సంస్థ మరిన్ని సంవత్సరాలు ముందుకు సాగాలన్నా, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలన్నా ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. ఖర్చులు తగ్గించుకుంటూ రక్షణతో కూడిన నాణ్యమైన ఉత్పత్తి సాధనకు కృషి చేయాలి. సంస్థ ఉంటేనే ఉపాధి, గుర్తింపు, సంక్షేమం అన్నీ సాధ్యమవుతాయి. మన అందరి ఏకైక లక్ష్యం నిర్దేశిత ఉత్పత్తి సాధించడం, సంస్థను కాపాడుకోవడమే కావాలి. ఆ దిశగా అందరం సమిష్టిగా పాటుపడదాం” అని జీఎం మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోతుకూరి కొమురయ్య ఇతరులు పాల్గొన్నారు .

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి: పీడీ రవీందర్



**నేరడిగొండ, మే 23 (ప్రజాజ్యోతి):** మండలంలోని కుమారి గ్రామంలో శనివారం ఐకెపి ఆధ్వర్యంలో రైతులకు నర్సరీ మునగ, వెదురు పెంపకంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా పీడీ రవీందర్, డీపీఎం శోభారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు సాంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయంగా మునగ, వెదురు పెంపకం చేపట్టడం ద్వారా మంచి లాభాలు గడించవచ్చని అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని, వేసవి దృష్ట్యా కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటితో పాటు అన్ని సరైన సౌకర్యాలు కల్పించాలని పీడీ రవీందర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంత్, ఈసీ కరీముద్దీన్, టెక్నికల్ అసిస్టెంట్ వినోద్, వీజీఎస్ రాజేశ్వర్, గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఐకేపీ సిబ్బంది మరియు స్థానిక రైతులు, కూలీలు పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వ ప్రక్రియ ప్రారంభం

### గోదాములను ప్రారంభించిన అధికారులు



**జైపూర్, మే 23 ప్రజా జ్యోతి** రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని సకాలంలో నిల్వ చేసి మిల్లులకు తరలించే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం జైపూర్ మండలంలోని ముదిగుంట,టేకుమట్ల, కుందారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం నిల్వ గోదాములను తహసీల్దార్ వనజ రెడ్డి,ఏపీఎం సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు గోదాముల వద్ద ధాన్యం నిల్వ ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని తెలిపారు. కేంద్రాల నుంచి తరలిస్తున్న ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే గోదాములు రైస్ మిల్లులకు చేర్చాలని సూచించారు. లారీల నిల్వలు లేకుండా వేగంగా దిగుమతి ప్రక్రియ పూర్తి చేయాలని అవసరమైన మేరకు హమాలీల సంఖ్య పెంచుకోవాలని మిల్లర్లకు ఆదేశించారు. గోదాములకు సమీప ప్రాంతాల రైతులు తమ ధాన్యాన్ని స్వయంగా కూడా తరలించుకోవచ్చని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ, తరలింపు ప్రక్రియను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని, సీఎంఆర్ లక్ష్యాల సాధనలో అధికారులు, మిల్లర్ల మధ్య సమన్వయం అవసరమని తహసీల్దార్ వనజ రెడ్డి పేర్కొన్నారు.

## సీఎం పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

### కొత్తగూడలో ఎస్పీ, అదనపు కలెక్టర్ పరిశీలన





**కెరమెరి మే 23 ప్రజా జ్యోతి** జూన్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కెరమెరి మండలం కొఠారి పంచాయతీ పరిధిలోని కొత్తగూడ గ్రామంలో శనివారము జిల్లా ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఏర్పాట్ల ను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమ స్థలాన్ని సందర్శించిన అధికారులు భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై సమీక్షించారు. సీఎం రాక కోసం ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పార్కింగ్ స్థలాలు, రహదారుల మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు వంటి అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ, అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు పాల్గొన్నారు

# దైనందిన జీవితంలో వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య





మంచిర్యాల, 23,మే (ప్రజా జ్యోతి):ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయం వ్యాయామం, యోగాకు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో శనివారం " ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 " రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన క్రీడా కార్యక్రమాల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడు తూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. 18వ తేదీన "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ", మారథాన్, ఫిజికల్ లిటరసీ కార్యక్రమాలు, 19వ తేదీన "కెరీర్ అండ్ స్కిల్ డెవలప్మెంట్", "ఎంపవర్ స్కిల్స్ -- ఎంపవర్ ఫ్యూచర్", 20వ తేదీన "యూత్ లీడర్‌షిప్ సమ్మిట్", 21వ తేదీన "ప్లే అండ్ పార్టిసిపేట్ -- స్పోర్ట్స్ డే", 22వ తేదీన "సర్వ్ అండ్ సపోర్ట్ -- యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ", 23వ తేదీన "ఉద్యోగ సాధన -- కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్" కార్యక్రమా లను వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించినట్లు వివరించారు. ఈ 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ప్రజలలో ఆరోగ్యకర జీవనశైలి అలవాటు చేయడం, యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నియంత్రణ, నైపుణ్యాభివృద్ధి, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు నిర్వహించి నట్లు తెలిపారు. అలాగే చిత్రలేఖన పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పారిశుధ్య కార్యక్రమాలు, స్పోర్ట్స్ డే వంటి కార్యక్రమా లను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను అన్ని విభాగాల సమన్వయం తో విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం చిత్రలేఖనం, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, యువతకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమం లో సంబంధిత శాఖల అధికారులు, యువతి యువకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందనున్న జీఎం (ఈ అండ్ ఎం) విశ్వనాథ రాజుకు ఘన సన్మానం



మంచిర్యాల, 23,మే (ప్రజా జ్యోతి): ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్న జనరల్ మేనేజర్ (ఈ అండ్ ఎం) / ఎండీ (ఏపీహెచ్ఎంఈఎల్) ఎన్.వి.కె. విశ్వనాథ రాజు ను శనివారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ తమ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. శ్రీరాంపూర్ ప్రాంతానికి విచ్చేసిన విశ్వనాథ రాజును మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా జీఎం శ్రీనివాస్ శాలువాతో సన్మానించి అభినందన లు తెలిపారు. సింగరేణి సంస్థలో వివిధ హోదాల్లో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి విశ్వనాథ రాజు చేసిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అలాగే, పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం కుటుంబ సభ్యుల మధ్య సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భం గా విశ్వనాథ రాజు సింగరేణి సంస్థలో తన ఉద్యోగ జీవితం, అనుభవాలు, అనుబంధాలను శ్రీరాంపూర్ ఏరియా అధికారులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమణరావు ఐకే గ్రూప్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వి. రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, గ్రూప్ ఇంజనీర్లు, ఈ అండ్ ఎం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడికి సన్మానం



నేరడిగొండ, మే 23 (ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన కుర్మే మహేందర్‌ను మాల మండల సంఘం ఆధ్వర్యంలో నేరడిగొండ మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాల సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుండి రాష్ట్ర స్థాయి పదవిని చేపట్టేలా ఎదిగిన కుర్మే మహేందర్ ప్రయాణం అభినందనీయమన్నారు. దళిత సమాజానికి ఆయన చేస్తున్న సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. మహేందర్‌కు ఈ పదవి దక్కేందుకు సహకరించిన టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ ఎంపీ సోయం బాపురావులతో పాటు, ముఖ్యంగా బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్‌కు మాల సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మాల సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ అనుపట్ల సంజీవ్ కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆడేళు మాల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుర్మే నారాయణస్వామి, సంఘం నాయకులు చిప్పరి రాజేశ్వర్, దావుల శ్రీనివాస్, అరవింద్ కుమార్, దావుల ప్రశాంత్, మద్దెల దయాకర్, నవీన్ కంటిగ, క్రాంతి కుమార్, కృష్ణ, బంటి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి







## - జూనియర్ సివిల్ జడ్జి కుంభ సందీప్.

సోనాల మే 23 ( ప్రజాజ్యోతి )సోనాల మండలం మారుమూల గ్రామాలైన కేశవ్ గూడా, సంపత్ నాయక్ తండాలలో తెలంగాణ హైకోర్టు వారి ఆదేశాలనుశారం మొబైల్ లోక్ అదాలత్ అవగాహన సదస్సును బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కుంభ సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జడ్జి కుంభ సందీప్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు తక్షణమార్గంలోక్ అదాళతే అని,ఖర్చు లేకుండా సమస్యలను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. పల్లెలలో చట్టాలపై తమ హక్కులపై అవగాహన లేకపోవడం వల్ల చాలామంది నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగివుండి బాధ్యతతో నడుచుకోవాలని తెలిపారు. యువత గంజాయి, గుడుంబా లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరదని సూచించారు. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని చెప్పారు. యువత చెడు అలవాట్లకు లోనయి తమ జీవితాలను నాశనం చేసుకోకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. పల్లెల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. పిల్లలను విధిగా పాఠశాలలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు సిర్పూర్ మహేష్ ,సందేశ్, చౌహాన్ అర్జున్ సింగ్, పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్ సంపత్ నాయక్ తండ మాజీ సర్పంచ్ సాకారం, గ్రామస్థులు విలాస్,ఇందాల్ సింగ్, ప్రతాప్ సిం.గ్ కేశవగూడ గ్రామస్థులు జైతు పటేల్ జాకేష్ , శంభు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు





**ప్రతి రోజు బడికి వచ్చేలా**

**ప్రత్యేక చర్యలు – విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ప్రభుత్వ బడి ప్రధానోపాధ్యాయులు అరవింద్‌మైసా.**

**మామడ మే 24 (ప్రజా జ్యోతి)** పోన్కల్ లో ఉన్న ఉన్నత ప్రభుత్వ పాఠశాల విద్యా రంగంలో కొత్త మార్పులకు శ్రీకారం చుడుతోంది. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాఠశాలలో తరగతులను ప్రారంభించడానికి, నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిగత శ్రద్ధ, ఆధునిక సదుపాయాలతో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థులకు బోధన అందించేందుకు వెల్ క్వాలిఫైడ్ టీచర్స్ ఉన్నారని తల్లి దండ్రులు గమనించి మీ యొక్క విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కొరకు ప్రభుత్వ పాఠశాలకు పంపవలసిందిగా ప్రధానోపాధ్యాయులు అరవింద్ మైసా విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. చిన్నారులకు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయడంతో పాటు ఆటపాటల ద్వారా ఆనందకరమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ, ప్రతిరోజూ హోంవర్క్ ఇచ్చి చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత కల్పించారు. ప్రతి తరగతి గదిలో ఫర్నిచర్ ఏర్పాటు చేసి సౌకర్యవంతమైన వాతావరణంలో బోధన కొనసాగిస్తున్నారు. ఏఐ ఆధారిత కంప్యూటర్ శిక్షణతో విద్యార్థులను భవిష్యత్తు సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేస్తున్నారు. అనుభవజ్ఞులైన ఉ పాధ్యాయులచే క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందిస్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారు. ముఖ్యంగా ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు ప్రధానోపాధ్యాయుడు అరవింద్ మైసా స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చదువుపై పర్యవేక్షణ చేయడం విశేషం. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఉచితంగా రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్, మధ్యాహ్నభోజనం, అందిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా మా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. పొన్కల్ గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయుడు అరవింద్ మైసా కోరారు.

# పంచాయతీల్లో పారిశుభ్రత అభివృద్ధి, యాక్షన్ ప్లాన్ పనులు అమలు చేయాలి





**జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్**

**సర్పంచ్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం**

**ఖానాపూర్ మే 23 (ప్రజాజ్యోతి )** గ్రామపంచాయతీలో పరిశుభ్రతతో పాటు వివిధ అభివృద్ధి పనులు ఇంటి పన్ను తదితర యాక్షన్ రాళ్లపై ప్రత్యేక సమావేశం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి రైతు వేదికలో శనివారం సర్పంచుల, కార్యదర్శుల, సమీక్షి సమావేశం జరిగింది ఈ కార్యక్రమంలో డిపిఓ తో పాటు డివిజనల్ పంచాయతీ అధికారి లింగయ్య ఎంపీడీవో సిహెచ్ రాధా రాథోడ్ ఎం పి ఓ లు రత్నాకర్ రావు, రమేష్ రెడ్డి అనిల్ కుమార్,శ్రీనివాస్,రైతు వేదిక లో సర్పంచులతో పంచాయతీ కార్యదర్శులతో జిపిడి యాక్షన్ ప్లాన్ సానిటేషన్ 2026 యాక్షన్ ప్రకారం హౌస్ టాక్సీ తీర్మానంతో ఫిక్స్, సుప్రీంకోర్టు న్యాయస్థానం జారీ చేసిన సివిల్ నెంబర్ 61 74 అమలులో ఉన్న ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2016 రద్దుచేసి రద్దుకు ముందు జరిగిన లేదా జరగని చర్యలకు భంగం కలగకుండా ఘన వ్యర్థాల నిర్వహణ కొరకు కొత్త నియమాలను రూపొందించడమైనది. ఈ నియమాలను ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026 అని పిలువబడుతాయని డిపిఓ అన్నారు 2026 నుంచి అమలులోకి వస్తాయని తడి, పొడి వ్యర్థాలు అలాగే శానిటరీ వ్యర్థాలు ప్రత్యేక జాగ్రత్త అవసరమైన వ్యర్థాలు . చెత్త ప్లాస్టిక్ రీసైక్లింగ్. సాలిడ్ వేస్ట్ యాక్షన్ ప్లాన్. 2024,25 కింద మంజూరై విడుదలైన గ్రాంటు సంబంధిత జిపి డిపి యాక్షన్ ప్లాన్ సంబంధిత పనులపేర్లతోనే ఆమోదంతో అన్ని అంశాలు గ్రామపంచాయతీ ల తీర్మానంతో ఆమోదంతో ఉండలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేసినారు. ఈ మేరకు ఈ యాక్షన్ ప్లాన్ ద్వారా పంచాయతీల్లో పూర్తిస్థాయి పారిశుభ్రత అంశాల్లోని పరకళలోకి తీసుకొని సంపూర్ణంగా ఇంటి పనులు వసూలు చేసి అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్ పాలకవర్గ సభ్యులను కోరారు

## త్రాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త మోటార్ ఏర్పాటు



**జైపూర్, మే 23: ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని నర్వ గ్రామ పంచాయతీలో త్రాగునీటి బోరు ఇటీవల చెడిపోవడంతో గ్రామ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే చర్యలు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ ఆగిడి స్రవంతి లింగన్న తెలిపారు. శనివారం కొత్త మోటార్ కొనుగోలు చేసి బోరుకు అమర్చినట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు నిరంతర త్రాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఇంటింటికి పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి నీరు అందించే విధంగా కృషి చేస్తామని సర్పంచ్ ఆగిడి స్రవంతి లింగన్న హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామగిరి వెంకటేష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 25న ఎర్వచింతల్లో ఇసుక వేలం

**తాసిల్దార్ సుజాత వెల్లడి**

**ఖానాపూర్ మే 23( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మండలంలోని ఎర్వ చింతల్ గ్రామంలో ఈనెల 25న ఉదయం 10 గంటలకు ఇసుక వేలం నిర్వహించబడుతుందని తాసిల్దార్ సుజాత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ఏర్వ చింతల్ ప్రభుత్వ అపర్ ప్రైమరీ స్కూల్ వెనకాల 30 ట్రిప్పులు కొలం గూడా వెళ్లే దారిలో10 ఇసుక మొత్తం 40 ట్రిప్పుల అక్రమంగా తరలిస్తున్న క్రమంలో జిపిఓ మండల గిదావర్లు సీజ్ చేశారని అన్నారు ఆసక్తిగల వ్యక్తులు వేలంలో పాల్గొనడానికి 5వేల రూపాయల ధరావత్ చెల్లించి వేర్వేరుగా జరిగే వేలంలో పాల్గొని ఎక్కువ ధర పాడిన వ్యక్తులకు ఇసుక స్వాధీనం చేపడుతుందని తెలిపారు మరిన్ని వివరాలకు గ్రామ జిపిఓ సెల్ నెంబర్ 8985454650కు సంప్రదించాలని తాసిల్దార్ సుజాత రెడ్డి ప్రకటనలో కోరారు

## పాలీసెట్ లో రాష్ట్రస్థాయిలో ఖానాపూర్ విద్యార్థిని అనన్య లక్ష్మి ప్రతిభ







**ఖానాపూర్ మే 23( ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర స్థాయి 2026 పాలీసెట్ పోటీ పరీక్షల్లో నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన విద్యార్థిని కమోజి అనన్య లక్ష్మి ప్రతిభ కనబరిచి 120 మార్కులకు గాను 118 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 54వ ర్యాంకు సాధించింది ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సీ ఫలితాల్లోను 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 3వ స్థానంలో నిలిచి మరోసారి తన ప్రతిభను పాలీసెట్ లో చాటుకుంది. ఈ సందర్భంగా వాసవి స్కూల్స్ యాజమాన్యం విద్యార్థిని అనన్య లక్ష్మిని శాలువాతో సత్కరించి అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు కమోజి వేణుగోపాల్, పద్మల కుమార్తె సాధించిన విజయంపై పలువురు హర్షం వ్యక్తంచేశారు

## జొన్న కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన చైర్మన్



**సారంగాపూర్, మే 23,ప్రజా జ్యోతి** వ్యవసాయ మార్కెట్ లో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది, కౌట్ల ాాజూ చైర్మన్ ఆయిర నారాయణ రెడ్డి ప్రారంభించరు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మద్దతు ధర 3699/- కావున రైతులందరు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో జొన్న పంటను విక్రయించాలని దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయకాంత్ రావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ నర్సయ్య,గోదాం ఇంచార్జి సోమ్లా నాయక్, నాయకులు భూమారెడ్డి, నారాయణ రెడ్డి, సోహెల్, రైతులు పాల్గొన్నారు

## బోథ్ మార్కేట్ కమిటీ డైరెక్టర్ లకు ఘన సన్మానం



**సోనాల, మే 23 ( ప్రజాజ్యోతి ) :**సోనాల మండల కేంద్రానికి చెందిన, నూతనంగా ఎన్నికైన బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు మునేశ్వర్ సోమన్న, జుంగల భోజన్న లకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్, డిసిసి జిల్లా కార్యదర్శి లోలపు పోశెట్టిలు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ లో ప్రతి కార్యకర్త కు గుర్తింపు వస్తుందని, పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి లోలపు పోశెట్టి, సోనాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్, సర్పంచ్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు బాశెట్టి సుదర్శన్, అమృత్ రావ్ పాటిల్, రామాయి. రవీందర్ భీంరావు పాటిల్, విజయ్ భాస్కర్, మాధవ రావు, నరేందర్, భోజరాజు, జ్ఞానేశ్వర్, మారుతి, అంకుష్, చెట్లపేల్లి సుధీర్, సంతోష్, సత్యనారాయణ,తదితరు పాల్గొన్నారు..

## కలప పట్టివేత



**బోథ్, మే 23 (ప్రజా జ్యోతి)** బోథ్ మండలంలోని పిప్పల దారి గ్రామ శివారంలో కలప తరలిస్తున్నారననే విశ్వసనీయమైన సమాచారం మేరకు తనికి చేపట్టగా శనివారం ఎద్దుల బండిలో విలువైన టేకు దుంగలను లోడింగ్ చేస్తుండగా పట్టుకున్నట్లుగా బోథ్ ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ జె.కవిత తెలిపారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను ఎడ్ల బండిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. పట్టుకున్న వారిలో ఎఫ్ ఎస్ ఓ నాగారావ్ ఎఫ్ బి ఓలు సంధ్యా, అనిల్,నాగరావ్, బేస్ వాచర్లు ఉన్నారు.

# నేడు ఖానాపూర్ లో మంత్రి పర్యటన బొడ్డునికుంట అభివృద్ధికి1 కోటి 20 లక్షలతో శంకుస్థాపన



**ఖానాపూర్ మే 23 (ప్రజా జ్యోతి )**దఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి నిరంతరం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సారథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని బొడ్డాని కుంట సుందరీకరణ అభివృద్ధి పనులకు 1 కోటి 20 లక్షలు శ్రీకారం చేయన్నారని ఆదివారం ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ పర్యాటక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు మధ్యాహ్నం 1:30 గంటలకు ముఖ్య అతిథిగా హాజర్ అయ్యి శంకుస్థాపన అలాగే నియోజకవర్గంలోని దస్తురాబాద్ మండల కేంద్రంలో రూ.20 లక్షల వ్యయంతో పీహెచ్సీ సబ్ సెంటర్ నిర్మాణ పనులనుసైతం ఖానాపూర్ నుండే మంత్రి ప్రారంభించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు జంగిలి శంకర్ గౌర్రె గంగాధర్ తో పాటు పలువురు క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు కార్యక్రమం లో ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం 7వార్డ్ కన్సిలర్ నిమ్మళ రమేష్ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు రాజు నాయక్ కౌన్సిలర్ నాయకులు జమాల్ కురేషి మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కావాలి సంతోష్ మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షావ్కత్ పాషా అమానుల్ల ఖాన్ జన్నారపు శంకర్ కుర్మా శ్రీను శేషాద్రి చింత పండు రవి మేధారి రాజేశ్వర్ ద్యావతి రాజేశ్వర్ ముగ్గనూరి శ్రీహరి మడిగేలాగంగధర్ సంతోష్ గౌడ్ రాము తదితరులు పాల్గొన్నారు

# కుమారి గ్రామంలో తృటిలో తప్పిన పెను ప్రమాదం



**నేరడిగొండ మే 23( ప్రజాజ్యోతి):**మండలంలోని కుమారి గ్రామంలో శనివారం తృటిలో ఒక పెను ప్రమాదం తప్పింది. గ్రామంలో మరోసారి అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో స్థానిక రైతులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.వ్యవసాయదారులు తమ పంట పొలాలను చదును చేసుకునే క్రమంలో, పొలంలో మిగిలిపోయిన జొన్న, మొక్కజొన్న బెండుకు నిప్పు పెట్టారు. అయితే, ఒక్కసారిగా వీచిన ఈదురుగాలుల కారణంగా ఆ మంటలు ఉధృతంగా చెలరేగి, సమీపంలోనే ఉన్న జొన్న పంట కొనుగోలు కేంద్రం వైపు దూసుకువచ్చాయి. ఆ కొనుగోలు కేంద్రంలో రైతులు విక్రయించడానికి తెచ్చిన వందల క్వింటాళ్ల జొన్న ధాన్యం నిల్వ ఉండడంతో, ఎక్కడ తమ పంట బూడిదవుతుందోనని రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న కుమారి పిఎసిఎస్ చైర్మన్ మందుల రమేష్ తక్షణమే స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన ఆయన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్తో వేగంగా సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు కొనుగోలు కేంద్రానికి వ్యాపించకుండా సకాలంలో ఆర్పేయడంతో వందల క్వింటాళ్ల జొన్న పంట సురక్షితంగా బయటపడింది. దీంతో రైతులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ రెస్క్యూ ఆపరేషన్లో అగ్నిమాపక సిబ్బంది అంజు రాథోడ్, శివాజీ రాథోడ్, రాజేందర్, ఆకుల రాజేందర్ లు పాల్గొని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఇందులో గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, రైతులు తదితరులు ఉన్నారు.

# వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 23 ,( ప్రజాజ్యోతి ).**జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు కొనుగోలు చేసిన వరి, మొక్కజొన్న ధాన్యం వివరాలను సమీక్షించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ధాన్యం తరలింపునకు అనుగుణంగా లారీలను సమకూర్చుకోవాలన్నారు. తగినంత మంది హమాలీల ద్వారా తూకం, ధాన్యం లోడింగ్ ప్రక్రియ పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగిన వసతులు ఉండాలన్నారు. అధికారులంతా కొనుగోలు ప్రక్రియ పై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జొన్న పంట కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపడతాం

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 23 ,( ప్రజాజ్యోతి ).** జొన్న పంట కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపడుతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం బైంసా పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, జొన్న పంట కొనుగోలు ప్రక్రియపై, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జొన్న, మొక్కజొన్న పంట కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేస్తామని అన్నారు. పంట అమ్మకం విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని వివరించారు. ఇప్పటివరకు ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పూర్తి చేసిన మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ, ఇంకా కొనుగోలు చేయాల్సిన మొక్కజొన్న పంట వివరాలను వివరించారు. ఎక్కడ కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశామని అన్నారు. సరిపడినంత మంది హమాలీలు, లారీల ద్వారా కొనుగోలు ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, పంటల అమ్మకంలో రైతులకు ఇబ్బందులు కలగకూడదని అన్నారు. పంట కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన పంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సరిపడినన్ని లారీలు, హమాలీలతో ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలిస్తూ ఉండాలన్నారు. అధికారులు అంతా క్షేత్రస్థాయిలో పంటల కొనుగోలు విషయంలో పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. భైంసా డివిజన్ మండలాల వారిగా పంటల కొనుగోలు వివరాలను తహసిల్దార్ లను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్, భైంసా డివిజన్ తహసిల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి





## అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 23 ,( ప్రజాజ్యోతి ).** యువత నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగ సాధనపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమలోని నైపుణ్యాలను పెంపొందించుకుని, లభించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన 40 మంది అభ్యర్థులకు జిల్లా అదనపు కలెక్టర్ చేతుల మీదుగా నియామక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జాతీయ స్థాయి యువ దినోత్సవాల్లో పాల్గొన్న 'పాటె మా ప్రాణం' సంగీత అకాడమీ కళాకారులను, జిల్లా నుండి జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. చిత్రలేఖనం, ఉపన్యాస పోటీల విజేతలకు, సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ ఏడీ నరసింహారెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేదా భారతి పీఠం ఆధ్వర్యంలో గోమాతకు హారతి

**బాసర మే 23 (ప్రజాజ్యోతి)** నిర్మల్ జిల్లా బాసర శ్రీ వేద భారతి పీఠంలో ప్రతి శనివారం నిర్వహించే గో హారతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా రుద్ర హోమం రుద్రాభిషేకలు నిర్వహించి గో హారతి కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భారతదేశానికి వ్యవసాయం వెన్నుముక ఆ వ్యవసాయానికి గోవులు ఆధారం ఆ గోవులను పూజించుకోవడం ప్రతి ఒక్కరికి కర్తవ్యం అని స్వామీజీ తెలియజేశారు వచ్చిన భక్తులందరికీ అన్నదానం నిర్వహిస్తున్నారు ముందుగా గణపతి పూజ రుద్రాభిషేకం గోపూజ నిర్వహిస్తున్నారు



ఈ కార్యక్రమంలో భక్తులు బాసర గ్రామ ప్రజలకు పాల్గొన్నారు

# అడ్వకేట్ హత్య హేయమైన చర్య, దాడి వ్యక్తులపై కఠిన చర్య తీసుకోవాలి

## బార్ అసోసియేషన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు సురేష్

**ఖానాపూర్ మే 23( ప్రజా జ్యోతి )** శనివారం ఉదయం హైదరాబాద్ లో అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్ ని హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బార్ అసోసియేషన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు మంత్రారాజశీ సురేష్ ఒక ప్రకటన లో తెలిపారు.. న్యాయవాదులపై చట్టవిరుద్ధ చర్యలు అత్యంత హేయమైన చేరియనే కాకుండా, న్యాయ వృత్తి గౌరవం చట్ట పరిపాలనపై జరిగిన దాడిగా అభివర్ణించారు .అడ్వకేట్లు న్యాయస్థాన అధికారులుగా న్యాయ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తారని విధి నిర్వహణలో ఉన్న అడ్వకేట్‌పై బెదిరింపులు, హింస దాడులు చేయడం సహించలేమన్నారు ఈ దాడికి బాధ్యులైన వ్యక్తులపై సంబంధిత అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు న్యాయవాదుల సమాజం అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్ కి సంఘీభావం ప్రకటిస్తూ, ఈ క్లిష్ట సమయంలో తమ సంపూర్ణ మద్దతును తెలియ చేయాల్సిన పరిస్థితిలో పొందని సురేష్ అన్నారు "ఒక అడ్వకేట్‌పై జరిగిన దాడి మొత్తం న్యాయవాదుల సమాజంపై జరిగిన దాడితో సమానం."గా భావించి ప్రతి స్పందించాలని ప్రకటనలో అన్నారుద

# ఇచ్చోడ పీహెచ్‌సీలో ఈ-ఆరోగ్యం యాప్‌పై సిబ్బందికి శిక్షణ

## మహిళా సంఘాల సభ్యుల డిజిటల్ హెల్త్ రికార్డుల న మోదుపై అవగాహన

## హాజరైన డీపీఎం హేమలత ఆరోగ్య శాఖ అధికారులు





**ఇచ్చోడ, మే 23, (ప్రజా జ్యోతి)** ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సంఘాల (ఎస్ హెచ్ జి) సభ్యుల డిజిటల్ హెల్త్ రికార్డుల నమోదు ప్రక్రియపై సి బ్బందికి ఒక రోజు ప్రత్యేక శిక్ష ణా కార్యక్రమం నిర్వహించా రు. మహిళల ఆరోగ్య వివరాలను డిజిట లైజ్ చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఆరోగ్యం (హెచ్ ఎం ఐ ఎస్)" మొబైల్ అప్లికేషన్ వినియో గం, డేటా ఎంట్రీ విధానంపై ఈ సందర్భంగా క్షేత్రస్థాయి సిబ్బం దికి సమగ్ర అవగాహన కల్పిం చారు. ఈ శిక్షణా కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా హా జరైన జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డిపిఎం) హేమలత మాట్లా డుతూ మండలంలోని ప్రతి మహిళా సంఘం సభ్యురాలి ఆరోగ్య సమాచారాన్ని ఈ యాప్ లో ఖచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో సిబ్బంది అను సరించాల్సిన కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్)ను ఆమె వివరించారు. అనంతరం హెల్త్ డి పార్ట్‌మెంట్ నుండి హాజరైన జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ (డిపిఓ) జె. దేవిదాస్ మాట్లాడుతూ 'ఈ–ఆరోగ్యం' యాప్‌లో స భ్యుల వివరాలను ఎలా రిజి స్ట్రేషన్ చేయాలి, లాగిన్ ప్రక్రి య, డేటా ఎంట్రీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రాక్టికల్‌గా చూపించారు. క మ్యూని టీ హెల్త్ ఆఫీసర్ (సి హెచ్ ఓ) బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ ఈ డిజిటల్ హెల్త్ రికార్డుల వల్ల భవిష్య త్తులో గ్రామీణ మహిళలకు అందే వైద్య సేవలు మరింత సులభతరం అవుతాయని, సిబ్బంది బాధ్యతగా రికార్డుల నమోదును పూర్తి చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని కోరారు. ఈ శిక్షణలో ఐబీ ఏపీఎం, ఇచ్చోడ ఏపీ ఎం, సీసీలు, హెల్త్ డిపార్ట్ మెంట్ డేటా మేనేజర్ రమణ, ల్యాబ్ టెక్నీషియన్ పరమేశ్వ ర్, సంబంధిత ఐకేపీ, హెల్త్ డి పార్ట్‌మెంట్ సిబ్బంది, మహిళ లు పాల్గొన్నారు.

# తీవ్ర ఎండలు, వడ దెబ్బపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రజా రోగ్య సూచనలు



**ఆదిలాబాద్ బ్యూరో, మే 23, (ప్రజా జ్యోతి)** ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఎండల తీవ్రత, వేడి గాలులు అ ధికంగా ఉన్నందున, ప్రజలందరూ వడదెబ్బ బారిన పడకుం డా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఎండల ప్రభావం అందరిపై ఉన్నప్పటికీ చిన్న పి ల్లలు, వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఒంటరిగా ఉండేవారు, బహిరంగ ప్రదేశాల్లో శారీరక శ్రమ చేసే కార్మికులు ఎక్కువ ప్రమాదంలో ఉంటారని, కాబట్టి వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ వేసవి కాలంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. అందుకోసం రేడియో, టీ వీ, వాతావరణ శాఖ ద్వారా వచ్చే స్థానిక వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ ఉండా లన్నారు. సాధ్యమైనంత వర కు పగటిపూట ఇళ్లలోనే సుర క్షితంగా ఉండాలని, గాలి వెలుతురు వచ్చే చల్లని ప్రదేశా లలో సమయం గడపాలని తెలిపారు. పగటి సమయం లో ఇంటి కిటికీలు, కర్టెన్లు మూసి ఉంచి, రాత్రి వేళల్లో చల్లని గాలి కోసం వాటిని తెర వాలని సూచించారు. అలాగే, బయట పనులను లేదా బహిరంగ కార్యకలాపాలను ఉద యం లేదా సాయంత్రం వంటి చల్లని వేళల్లోనే ప్లాన్ చేసుకో వాలని స్పష్టం చేశారు. శరీరం లో నీటి శాతం తగ్గకుండా చూ సుకోవడం వడదెబ్బ నుంచి తప్పించుకోవడానికి ప్రధాన మార్గమని వివరించారు. మీ కు దాహం వేయకపోయినా సరే, వీలైనప్పుడల్లా తగినంత నీరు త్రాగాలని, ఎందుకంటే డీహైడ్రేషన్‌ను గుర్తించడానికి దాహం ఒక్కటే సరైన సూచిక కాదని పేర్కొన్నారు. ప్రయాణాలు చేసేటప్పుడు తప్పని సరిగా తాగునీటిని వెంట తీసుకె ళ్లాలని సూచించారు. నిమ్మరసం, మజ్జిగ, ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓ ఆర్ ఎస్) ఇంట్లో తయారుచేసే పానీయాలలో కొద్దిగా ఉప్పు కలిపి తీసుకోవడం మంచిదన్నారు. వీటితో పాటు పుచ్చకాయ, కర్బూజ, ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ, పాలకూర వంటి అధిక నీటి శాతం కలిగిన సీజ నల్ పండ్లు, కూరగాయలను ఆహారంలో భాగంగా తీసుకో వాలని కోరారు. బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు వాతావ రణానికి తగినట్లుగా సన్నని, వదులుగా ఉండే, లేత రంగు కాటన్ దుస్తులను ధరించడం ఉత్తమమని తెలిపారు. ఎండ దెబ్బ నేరుగా తగలకుండా గొ డుగు, టోపీ, టవల్ లేదా సం ప్రదాయ తలపాగాతో తలను కప్పుకోవాలని, కాళ్లకు చెప్పులు లేదా బూట్లు తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. ఒకవేళ ఎవరికైనా శరీర ఉష్ణోగ్రత విపరీతంగా పెరగడం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు లేదా వికారం కావడం, అధికం గా చెమటలు పట్టడం లేదా చె మటలు పూర్తిగా ఆగిపోవడం, స్పృహ తప్పడం వంటి వడ దెబ్బ లక్షణాలు కనిపిస్తే అస్స లు నిర్లక్ష్యం చేయవద్దని హె చ్చరించారు. అలాంటి బాధి తులను వెంటనే చల్లని ప్రదేశా నికి తరలించి, నీరు లేదా ఓఆర్ ఎస్ అందిస్తూ, ఆల స్యం చేయకుండా సమీపంలో ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్య సహాయం అందించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

---

## జొన్నలకు కొనుగోలు ప్రక్రియ ను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో,మే 23, (ప్రజా జ్యోతి)** జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లాలో జొన్నల కొనుగోళ్ల ప్రక్రియ, రవాణా ఏర్పాట్ల పైయన అత్యవసర గూగుల్ మీట్ నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జొన్నల కొను గోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశిం చారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన రవాణా సదుపా యాలు, గిడ్డంగుల ఏర్పాట్లను పక్కాగా పర్యవేక్షించాలని సం బంధిత శాఖల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జా రీ చేశారు. ఈ గూగుల్ మీట్ లో అడిషనల్ కలెక్టర్ (రెవె న్యూ) ఆర్.ఎస్.చిత్రు, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్‌డీఓ రవీంద ర్, జిల్లా వ్యవసాయ అధికారి మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్, మార్కెటింగ్ ఏడీగ జానన్, జిల్లా రవాణా అధికా రి శ్రీనివాస్, డీసీఎస్ఓ నందిని, సివిల్ సప్లైస్ డీఎం సుధారాణి, డీసీఓ, పిన్ పాయింట్ అధికారులు, ఎంపీ డీఓలు, మండల వ్యవసాయ అధికారులు, పీఏసీఎస్ సెక్రటరీలు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లాలో 'టూరిజం కిట్' ఆవి ష్కరణ



**ఆదిలాబాద్ బ్యూరో, మే 23, (ప్రజా జ్యోతి)** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ప ర్యాటక రంగాన్ని మరింతగా ప్రమోట్ చేసేందుకు సిద్ధం చేసిన ప్రత్యేక 'టూరిజం కిట్'ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పర్యాటక ప్రాంతాల విశి ష్టతను చాటిచెప్పేలా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కిట్‌ను అత్యంత ఆకర్షణీయంగా రూపొందించడం జరిగిందని తెలిపారు. పర్యాటక రంగానికి సంబంధించిన సమగ్ర సమా చారంతో రూపొందించిన జి ల్లా టూరిజం బుక్, పెన్ను, పేపర్ వెయిట్, కీ చైన్‌లతో పా టు టీ కప్పులపై ఉపయోగించే ప్రత్యేక కవర్లను ఈ కిట్ లో పొందుపరచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా పర్యాటక శాఖాధికారి రవికుమార్, డిఆర్డిఓ రవీందర్, డి ఎం హెచ్ ఓ నరేందర్, మున్సిపల్ కమిషన ర్ జగదీశ్వర్ గౌడ్, జిల్లా సంక్షే మ అధికారి మిల్కా, ఇతర అధికారులు, తదితరులు పాల్గొ న్నారు.

---

# భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి



భూ పరిపాలన ప్రధాన కమిష నర్ డి.ఎస్. లోకేష్ కుమార్



**ఆదిలాబాద్ బ్యూరో, మే 23, (ప్రజా జ్యోతి)**భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతం గా పూర్తి చేయాలని భూ పరి పాలన ప్రధాన కమిషనర్ డి. ఎస్. లోకేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతం చేయడం పై శనివారం హైదరాబాద్ నుండి భూ పరిపాలన ప్రధాన క మిషనర్ డి.ఎస్. లోకేష్ కు మార్, ఐఏఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు రెవెన్యూ లతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమావేశా న్ని నిర్వహించారు. ఈ వీడి యో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్ట రేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజ ర్షి షా, అదనపు కలెక్టర్ ఆర్. ఎస్. చిత్రు తో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్ర స్తుతం ఉన్నా మార్కెట్ డిమాండ్, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మే 28 నాటికి మార్కెట్ విలువల సవరణ పూర్తి చేయాలని అధికారుల ను ఆదేశించారు. క్షేత్రస్థాయి లో ఉన్న వాస్తవ మార్కెట్ ధరలను నిశితంగా పరిశీలించి, ఎలాంటి వ్యత్యాసాలు లే కుండా శాస్త్రీయంగా ఈ విలు వలను ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ రిజి స్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దే శిత గడువులోగా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు ఆదిలాబాదు జిల్లాలో భూము ల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, గడువులోగా పూర్తి చే స్తామని కలెక్టర్ రాజర్షిషా తెలి పారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి ఎక్క డా ప్రజలకు ఇబ్బంది కలగ కుండా, అదే సమయంలో ప్ర భుత్వ నిబంధనలకు లోబడి ఈ సవరణలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశం లో ఆర్డీఓ జగదీశ్వర్ రావు, నాయబ్ తహసీల్దార్ కవిత, ధరణి కోఆర్డినేటర్ స్వాగత్, సంబంధిత అధికారులు, తది తరులు పాల్గొన్నారు.

# జల సంజయ్ జన భాగీ దారి నీ అధికారులు విజయవంతం చేయాలి



## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ బ్యూరో, మే 23, (ప్రజా జ్యోతి)** జిల్లాలో రెండవ విడత 'జల సంచయ్ జన భాగీదారి 2.0' కార్యక్రమం అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యా లయం నుండి సంబంధిత శాఖల అధికారులతో 'జలసంచ య్జన భాగీదారి 2.0' కార్య క్రమంపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దే శం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏ దాది నిర్వహించిన జల శక్తి 'జల సంచయ్ జనభా గీదారి 1.0 లో దక్షిణ భారతదేశంలోని జిల్లాల న్నింటి లోనూ అది లాబాద్ జిల్లా ప్రథమ స్థానా న్ని కైవసం చేసుకుందని, అదే స్ఫూర్తితో ఈసారి కూడా జిల్లాలో సాధించిన మంచి ప్రగతిని చూపిస్తూ, పోర్టల్లో ఫోటోలను అప్డేట్ చేయాలని అధి కారులను ఆదేశించారు. ఈ 'జలసంచయ్ జనభాగీదారి 2.0' కార్యక్రమాన్ని విజయ వంతం చేయడానికి పంచా యతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపాలిటీ, అటవీ శాఖ, ఇరిగేషన్, అగ్రికల్చర్, గ్రౌండ్ వాటర్, హార్టికల్చర్, ఐటీడీఏ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ వంటి దాదాపు 10 నుండి 12 ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ, జిల్లా వ్యా ప్తంగా మొత్తం 1,79,000 (లక్షా డెబ్బై తొమ్మిది వేల) ఫోటోలను అప్లోడ్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లా అధికారులు తమ క్షేత్రస్థాయి సి బ్బందితో పూర్తి స్థాయిలో సమన్వయం చేసుకొని, నిర్దేశిత లక్ష్యాల ప్రకారం ఫోటోలను సేకరించి పోర్టల్లో అప్లోడ్ చే యాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయు తంగా పనిచేసి మరోసారి జిల్లాను దేశంలోనే ప్రథమ స్థా నంలో నిలపడానికి కృషి చేయాలనీ కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో స్థానిక సంస్థల అదన పు కలెక్టర్ రాజేశ్వర్, డిఆర్డీఓ రవీందర్, మున్సిపల్ కమీషనర్ జగదీశ్వర్ గౌడ్, నీతి ఆయోగ్ ప్రోగ్రాం అధికారి రాహుల్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డికి సన్మానం చేసిన మాదిగ దండోరా నాయకులు





మార్కెట్ లో లేబర్ కొరత కూ డా తీరేలా జిల్లా కలెక్టర్ సహ కారంతో ప్రత్యేక చర్యలు చేప డు తున్నాం

మార్కెట్ కమిటీ చైర్మన్ బోరం చు శ్రీకాంత్ రెడ్డి

**ఆదిలాబాద్ బ్యూరో, మే 23, (ప్రజా జ్యోతి)** మాదిగ హక్కుల దండోరా నాయకుల ఆధ్వర్యంలో వ్యవసా య మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డికి ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శా లువాతో సత్కరించి పుష్పగు చ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మార్కెట్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రైతులకు, ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లా డుతూ మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి మార్కెట్ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం జొన్నల కొనుగోలు ప్రక్రియ సాఫీగా కొనసాగుతోం దని, లారీల కొరత, గోనె సం చుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే వెయింగ్, లోడింగ్ ప నుల కోసం అవసరమైన లేబ ర్ కొరత కూడా తీరేలా జిల్లా కలెక్టర్ సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కొనుగోలు చేసిన జొన్నలను నిల్వ చేయడానికి దర్శిత్ ఆగ్రోటెక్ లిమిటెడ్ వారి గోడౌన్ను లీజుకు తీసుకున్నామని, రైతులు పండించిన పంట మొత్తాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు బండారి అ శోక్, మహిళా అధ్యక్షురాలు తోకల గంగమ్మ, గౌరవ అధ్య క్షుడు బొజ్జ అడేళ్లు, జిల్లా ప్ర ధాన కార్యదర్శి సుద్దాల శివ కుమార్, జైనథ్ మండల అ ధ్యక్షుడు జవారి విట్టల్ తదిత ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్ ప్రవేశాల కౌన్సెలింగ్

పరిశీలించిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధి కారి మంద మకరందు



**ఆదిలాబాద్ బ్యూరో,మే 23 (ప్రజా జ్యోతి)**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడి యట్ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగాలని ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజె క్టు అధికారి మంద మకరందు అన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని లాల్ టెకిడి గిరిజన గురుకుల జూనియర్ కళా శాలలో నిర్వహించిన ఇం టర్మీడియట్ ప్రవేశాల కౌన్సె లింగ్ కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కౌన్సెలింగ్ కు హాజరైన విద్యా ర్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమ స్యలను తెలుసుకున్నారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్య మైన విద్య అందించడంలో గురుకుల విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొ న్నారు. ప్రవేశాల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయా లని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సమాచారం స్పష్టం గా అందించి, వారికి ఎటువంటి ఇ బ్బందులు కలగకుండా చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సెలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించిన ఆయన, తాగునీరు, కూర్చునే వసతి, ధ్రువపత్రాల పరిశీలన వంటి అంశాలు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచిం చారు. అలాగే ప్రవేశాల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల విద్యాసంస్థల అధి కారులు, అధ్యాపకులు, సి బ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఆదేశాలు, డీఎస్పీ వహీదుద్దీన్, సిఐ సంతోష్ కుమార్ సూచన మేరకు

కిరాణా కొట్లలో,టీ స్టాల్ లలో పాన్ షాప్ లలో డాగ్ స్క్వాడ్ సహాయంతో

గంజాయి, మత్తు పదార్థాల సోదాలు నిర్వహణ,సిర్పూర్(టి)



ఎస్సై సాగర్:

**మే 23, సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాసిర్పూర్(టి) మండల కేంద్రంలోని కిరాణా కొట్ల లో, టీ స్టాల్ లలో, పాన్ షాప్ లలో డాగ్ స్క్వాడ్ ల సహాయంతో గంజాయి, వివిధ మత్తు పదార్థాల సోదాలు నిర్వహించారు. అనంతరం ఎస్సై సాగర్ మాట్లాడుతూ. జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఆదేశాల మేరకు,డీఎస్పీ వహీద్ ఉద్దీన్, సీఐ సంతోష్ కుమార్,సూచన మేరకు సిర్పూర్(టి) పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎస్ఐ సాగర్ పోలీసులతో కలిసి మండలంలోని కిరాణా కొట్లలో, టీ స్టాల్ లలో పాన్ షాప్ లలో డాగ్ స్క్వాడ్ సహాయంతో గంజాయి ఇతర మత్తు పదార్థాల గురించి సోదాలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో డాగ్ స్క్వాడ్ సిబ్బంది ఏఎస్ఐ చంద్రశేఖర్ పిసి రాజ్ కుమార్,పాల్గొన్నారు

# సిర్పూర్ (టి) బస్టాండ్ సమస్యపై స్పందించిన ఆర్టీసీ డిఎం రాజశేఖర్

**క్షేత్రస్థాయిలో పరిశీలన భూ వివాదంతో నిలిచిన పనులు**



**మే 23, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి::** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాసిర్పూర్(టి) మండల కేంద్రంలో సంవత్సరాలుగా కొనసాగుతున్న బస్టాండ్ సమస్యపై ఆర్టీసీ జిల్లా మేనేజర్ (డిఎం) రాజశేఖర్ శనివారం స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. స్థానిక ఉప సర్పంచ్ ప్రశాంత్,నాయకులు ఒడ్డెటి నాన్నయ్య పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు సాయి.మోహన్, శివలతో కలిసి ప్రస్తుత తాత్కాలిక బస్టాండ్ ప్రాంతాన్ని సంద ర్శించి అక్కడి పరిస్థితుల ను పరిశీలించారు. బస్సులు నిలవడానికి ఇబ్బందిగా మారిన పిచ్చి మొక్కలు, పొదలను సిబ్బందితో వెంటనే తొల గింపజేశారు.ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండ తాత్కాలికంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.అయితే పనులు కొనసాగుతున్న సమయంలో స్థానికంగా నివాసముంటున్న గద్దల ప్రవీణ్ అక్కడికి చేరుకుని సదరు స్థలం గద్దల సుజాత పై తమ పట్టా భూమి అని అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డిఎం రాజశేఖర్, స్థానిక నాయకులు ఒడ్డెటి నన్నయ్య,పోలీసులు అదే విధంగా పంచాయతీ అధికారులు భూ సమస్య పై స్పందిస్తూ ఈ భూమి, బస్టాండ్ కోసం కేటాయిం చబడిందని వివరించారు. అయినప్పటికీ భూ యజమానులు వినిపించు కోకపోవడంతో అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొంది. దీనిపై సమగ్ర నివేదికను పైఅధికారులకు పంపిస్తు న్నట్లు డిఎం రాజశేఖర్ తెలిపారు. బస్టాండ్ కేటాయించిన భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి ప్రజలకు త్వరలోనే పూర్తి స్థాయి బస్టాండ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# సిర్పూర్ పేపర్ మిల్లు లో వెంటనే గుర్తింపు కార్మిక యూనియన్ ఎన్నికలునిర్వహించాలి

**ప్రతి కార్మికుడికి రూ.10 వేల అడహాక్ పేమెంట్ చెల్లించాలి**

**సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, (సిఐటియూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ డిమాండ్:బి**



**మే 23 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్టి నియోజకవర్గంలోని సిర్పూర్ కాగజ్ నగర్ పట్టణంలో ఉన్న సిర్పూర్ పేపర్ మిల్లు లో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించా.లని అదేవిధంగా పేపర్ మిల్లులో విధులు నిర్వ హిస్తున్న ప్రతి కార్మికుడికి 10వేల అడహాక్ పేమెంట్ చెల్లించాలని సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు.గత కొన్ని రోజులుగా సిర్పూర్ పేపర్ మిల్లు ప్రధాన గేటు ముందు కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టినరిలే నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ, గుర్తింపు యూనియన్ ఎన్నికలు లేకపోవడం వల్ల కార్మికుల న్యాయమైన అనేక సమస్యలు పరిష్కారం కాకుండా పోతున్నాయని అన్నారు. ఎన్నికల నిర్వహణను అడ్డుకునేందుకు ఎస్పీఎం యాజమాన్యం హైకోర్టులో కేసు వేయడం సరైన విధానం కాదని విమర్శించారు.దఇప్పటికైనా ఎస్పీఎం యాజమాన్యం బేషరతుగా హైకోర్టులో వేసిన కేసును వెనక్కి తీసుకొని గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించడానికి సహకరించాలని, గెలిచిన యూనియన్తో కొత్త అగ్రిమెంట్ చేసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు ప్రతి కార్మికుడికి ఏప్రిల్ 1వ తేదీ నుండి ప్రతినెల రూ.10 వేల అడహాక్ పేమెంట్ చెల్లించాలని కోరారు.రాష్ట్రంలోని అనేక పరిశ్రమల్లో 2026 సంవత్సరంలోనే గుర్తింపు ఎన్నికలు నిర్వహించారని, కానీ ఎస్పీఎంలో మాత్రమే లేబర్ కోడ్లను అడ్డం పెట్టుకొని ఎన్నికలను నిలిపివేయడం సరైంది కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లు తీసుకొచ్చినప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వాటిని నోటిఫై చేయలేదని, రూల్స్ కూడా రూపొందించలేదని తెలిపారు. అందువల్ల ప్రస్తుతం తెలంగాణలో లేబర్ కోడ్లు అమల్లో లేవని, అయినప్పటికీ వాటిని సాకుగా చూపించి ఎన్నికలు అడ్డుకోవడం అన్యాయమని పేర్కొన్నారు.సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ ఉపాధ్యక్షులు ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ, గతంలో ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఏ యూనియన్ ముందుకు రాని సమయంలో వర్క్స్ కమిటీగా కార్మికుల సమస్యలపై పనిచేశామని తెలిపారు. ఇప్పుడు గుర్తింపు ఎన్నికల డిమాండ్ ముందుకు వచ్చిన నేపథ్యంలో అన్ని సమస్యల పరిష్కారానికి మూలం గుర్తింపు ఎన్నికలేనని, వాటి కోసం దేనికైనా సిద్ధంగా ఉంటామని అన్నారు. గత అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసిందని, కొత్త అగ్రిమెంట్ జరిగే వరకు ప్రతి కార్మికుడికి రూ.10 వేల అడహాక్ పేమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ కూశన రాజన్న, ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, మొగిలి వెంకటేష్, సహాయ కార్యదర్శి గడమల్ల మహేష్, యూనియన్ నాయకులు విజయ్, నబిబాయి, జానీ, మైబూబ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్. త్రివేణి, జిల్లా కార్యదర్శి జె. రాజేందర్, కృష్ణమాచారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉట్నూర్ లో ఘనంగా స్వచ్ఛత డ్రైవ్



**ఆదిలాబాద్ బ్యూరో, మే 23 (ప్రజా జ్యోతి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళి కలో భాగంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత డ్రైవ్ కార్యక్రమం సందర్భంగా ఉట్నూరు చారి త్రక కోటలో ప్రత్యేక కార్యక్ర మం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమగ్ర గిరి జన అభివృద్ధి సంస్థ (ఐటిడి ఎ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉట్నూరు కోటకు ఉన్న చారి త్రక ప్రాముఖ్యతను వివరించా రు. గోండు రాజుల పాలన కా లంలో, సుమారు 18వ శతా బ్దంలో ఈ కోట నిర్మించబడిన ట్లు తెలిపారు. కోట చుట్టూ అ ద్భుతమైన నిర్మాణ శైలితో పా టు, గోండు రాజులు 14 గొలుసుకట్టు చెరువులను నిర్మించి నీటి పారుదల వ్యవస్థను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. అలాగే కోట పరిసర ప్రాంతాల్లో సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంకా కోటలో సుమారు 100 గదులతో కూడిన రెసిడెన్షియల్ నిర్మాణం ఉండటం ఆకాలపు వైభవాన్ని తెలియజేస్తోందని అన్నారు. చారిత్రక వారసత్వా నికి ప్రతీకగా నిలిచిన ఈ కోట ను భవిష్యత్ తరాలకు అం దించేందుకు ప్రతి ఒక్కరూ బా ధ్యతగా కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మరో 700 సంవత్సరాల తర్వాత కూడా ఈ కోట చరిత్రను గర్వంగా మాట్లాడుకునే స్థాయిలో పరిరక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కా ర్యక్రమంలో ఏపీ జనరల్ వ సంతరావు, డీడీ శ్రీ అంబాజీ, డిటిఓ ఆఫీసర్ శ్రీ రవికుమార్, గంగాధర్ రాజు పోర్ట్ వారసులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కోట పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చారిత్రక కట్టడాల పరి రక్షణపై అవగాహన కల్పించారు.

## రాష్ట్రంలోవిచ్చలవిడిగా జరుగుతున్న గోవులు, పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

**పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కోరిన సిర్పూర్ (టి) ఎమ్మెల్యే హరీష్ రావు వి.హెచ్.పి,భాజపా నాయకులు**



**మే 23,సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** హైదరాబాద్ నగరంలోని మినిస్టర్ కోటర్స్ లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డా.రావినూతల శశిధర్, సిర్పూర్(టి)శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సంద ర్భంగా వారు వినతి పత్రం అందజేస్తూ తెలంగాణ రాష్ట్రంలో పశువుల అక్రమ రవాణా విపరీతంగా పెరిగిపోయిందని, లేత వయసులో ఉన్న పశువులను కూడా వధశాలలకు తరలించి,పశువుల సంరక్షణ చట్టాలను తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. స్థానుకూలంగా స్పందించిన మంత్రి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వి.హెచ్.పి నాయకులు ప్రశాంత్, వినయ్ పత్రాలే, భాజపా ఓబీసీ మోర్చా నాయకులు ఆలె భాస్కర్, సంజయ్ ఘనాతే, గోరక్షకులు జస్మత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచికల్ పేట్ మండల నూతన ఎంపీడీఓకు ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సముద్రాల రాజన్న,నాయకులు




మే 23, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని పెంచికల్ పేట్ మండల నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా సంతోష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పెంచికల్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సముద్రాల రాజన్న పార్టీ నాయకులతో బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ సంతోష్ రెడ్డిని మండల పరిషత్ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించి,సత్కరించా రు.ఈ సత్కరణ కార్యక్ర మంలో పెంచికల్పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సముద్రాల రాజన్న కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నూతన ఎంపీడీఓను ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియ జేశారు.అనం తరం వారు మాట్లాడుతూ..మండల పరిధిలోని గ్రామాల్లో నెల కొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి, గ్రామాల సర్వతో ముఖాభి వృద్ధికి తమవంతు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెంచికల్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సముద్రాల రాజన్న, పెంచికల్ పేట్ సర్పంచ్ షేక్ ఉస్మాన్, పోతేపల్లి మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ దూగుంట రాజన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు శంకర్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ కృష్ణా, రమేష్, భక్తు సంతోష్ , పగిడి పాపయ్య, జాడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మనుమరాలి,బారసాల మహోత్సవంలో పాల్గొన్న సిర్పూర్ (టి) శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు



తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలోని సవాయ కన్వెన్షన్ లో భాజపా శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మనవరాలి బారసాల ఉత్సవంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్,నిజాం బాద్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త, బిజెపి రాష్ట్ర ఉపా ధ్యక్షులు వేరబెల్లి రఘు నాథ్, నాయకులు సురేందర్ రెడ్డి లతో కలిసి సిర్పూర్ (టి) ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ రావు చిన్నారిని ఆశీర్వదించారు.

# రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే గోవుల అక్రమ రవాణా

**సిర్పూర్ (టి) శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు**




మే 23, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి: హైదరాబాద్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొన్న సిర్పూర్ (టి) ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ రావు.ఈ సందర్భం గా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా గోవుల అక్రమ రవాణా జరుగు తుందని విమర్శించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి కార్యాలయం నుండే చీఫ్ సెక్రటరీ,కలెక్టర్లు,ఎస్పీలకు ఆదేశాలు వెళ్ళాయని, పోలీసులు దగ్గరుండి పశువుల అక్రమ రవాణా ను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తం గా ఇప్పటికే లక్షలాది పశువులు,గోవులు కబేళా లకు తరలిపోయాయని, ఐదు రోజుల్లో రానున్న బక్రీద్ పండుగ సందర్భం గా పెద్ద ఎత్తున పశు వులు తరలిపోయే అవకాశం ఉన్నదని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం గోవులు, పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు.పశువు ల సంరక్షణ చట్టాలు, అదేవిధంగా పశు వుల రవాణా నిబంధన ఉల్లంఘన జరుగుతున్నా ప్రభుత్వంచోద్యం చూస్తుం దని దుయ్యబట్టారు. ఎంఐఎం ఎమ్మెల్యేలు నిరంతరం జిల్లా అధికారుల మీద ఒత్తిడి తీసుకొచ్చి పశువుల అక్రమ రవాణా రాకెట్ నడుపుతున్నారని,వారికి ముడుపులు కూడా ముడుతున్నాయని తెలిపారు. పశువులు తరలిస్తున్న వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తే గోరక్షకుల మీద బైండోవర్ కేసులు పెడుతున్నారని, వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు.ఒక వైపు గోశా లలు నిర్మిస్తామని చెప్తున్న ముఖ్యమంత్రి ఇంకోవైపు ఇటువంటి అక్రమ రవాణా ను ప్రోత్సహిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పశు సంపద అంతరించి పోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు ఆలే భాస్కర్ రాజ్, సంజయ్ ఘనాథే పాల్గొన్నారు.

## ఏబీవీ పురం భూదాన్ బాధితులను కలిసిన ఎంపి ఈటల

హైదరాబాద్ : కూకట్పల్లి ఏబీవీ పురం భూదాన్ బాధితులను ఎంపి ఈటటల రాజేందర్ కలిసి బీజేపీ పార్టీ తరుపున భరోసా కల్పించారు. ఎంపి మాట్లాడుతూ హైదరాబాద్ ఒక మినీ ఇండియా అని, వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన పేద ప్రజలు ఇక్కడ జీవిస్తున్నారు. ఇండ్లలో పని చేసే మహిళలు, కూలీలు, చిన్న ఉద్యోగాలు చేసుకునే వారికి సొంత ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. అలాంటి పేద ప్రజలు ప్రభుత్వ, భూదాన్, దేవాలయ భూములపై చిన్న గుడిసెలు వేసుకొని బ్రతుకుతున్నారని అన్నారు. వీరంతా 300-400 గజాలలో కాదు, కేవలం 60-70 గజాల స్థలంలో సొంత ఇల్లు కావాలని కోరుకుంటున్నారు. దరాబాద్ పరిసర ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఇలాంటి పేద కాలనీలు వెలిశాయని, ఏబీవీ పురం కూడా అందులో ఒకటి. ప్రస్తుతం 7 ఎకరాల్లో ప్రజలు నివసిస్తుండగా, మరో 17-18 ఎకరాల్లో 850 మందికి 60 గజాల చొప్పున స్థలాలు ఇవ్వాలని డిమాండ్ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇది భూదాన్ భూమి అంటుండగా, ఐడిపిఎల్ సంస్థ తమ భూమి అని చెబుతోంది రాష్ట్ర ప్రభుత్వం, ఐడిపిఎల్ అధికారులు కలిసి చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. స్థానిక ఎంపీగా ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను. కోర్టు కేసుల కోసం ఖర్చు పెట్టే స్థోమత పేదలకు లేదని, లంచాలు లేకుండా న్యాయబద్ధంగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. భూదాన్ భూములను అమ్మే హక్కు ఎవరికి లేదు. భూదాన్ భూములు కేవలం పేదలకు మాత్రమే కేటాయించాలి. పేదల బాధలను అర్థం చేసుకొని ప్రభుత్వాలు వారి సమస్యలను పరిష్కరిస్తాయని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో వద్దేపల్లి రాజేశ్వర్ రావు, కాంతారావు, శ్రీకర్ రావు, పీట్ల మనోహర్ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## కిడ్నీ రోగులకు ఆశా కిరణంగా తెలంగాణ వైద్య రంగం

హైదరాబాద్ : కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తెలంగాణ వైద్య రంగం మరో ఆశాకిరణంగా నిలిచింది. రాష్ట్రంలో కిడ్నీ మార్పిడి చికిత్సల రంగంలో కీలక మైలురాయి నమోదైంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల కిడ్నీ ట్రాన్స్ప్లాంట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఆధునిక సాంకేతికత, నిపుణుల సేవలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల సహకారంతో ఈ ఘనత సాధ్యమైందని వైద్య నిపుణులు తెలిపారు.తెలంగాణలో కిడ్నీ మార్పిడి కార్యక్రమం 1989లో ప్రారంభమైంది. అప్పటి నుంచి 2023 వరకు దాదాపు 1,500 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించారు. అనంతరం గత మూడున్నర నుంచి నాలుగేళ్ల వ్యవధిలోనే మరో 500 శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తవడంతో మొత్తం ట్రాన్స్ప్లాంట్ల సంఖ్య రెండు వేలకు చేరుకుంది. ఇది రాష్ట్ర వైద్యరంగ ప్రగతికి నిదర్శనంగా వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11 వేల మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్పై ఆధారపడి చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏడాది సుమారు 500 మంది కొత్త రోగులు కిడ్నీ మార్పిడి కోసం నమోదు అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాన్స్ప్లాంట్ సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.కిడ్నీ మార్పిడి అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితి ఆశాజనకంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఒక సంవత్సరం తర్వాత గ్రాఫ్ట్ సర్వైవల్ రేటు 95 శాతం, మూడు సంవత్సరాల తర్వాత 90 శాతం, ఐదు సంవత్సరాల తర్వాత 85 శాతంగా నమోదవడం చికిత్సల విజయవంతతను ప్రతిబింబిస్తోంది.ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జేఎచ్ఎస్, సీఎంఆర్ఎఫ్ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ద్వారా అర్హులైన రోగులకు ఉచితంగా లేదా రాయితీపై చికిత్స అందిస్తున్నారు. హైదరాబాద్లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తున్నాయి.ఇక భవిష్యత్తులో రోబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను మరింత విస్తరించి, అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వైద్య నిపుణులు వెల్లడించారు. రాష్ట్రంలో అవయవదానంపై అవగాహన పెరగడంతో మరింత మంది రోగులకు కొత్త జీవితం అందించే అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## భాష ఏదైనా.. ఫిర్యాదు ఇక సులభం

**హైదరాబాద్ పోలీసుల అమ్ములపొదిలోకి 'ఏఐ కాప్రైటర్'**

**దేశంలోనే మొట్టమొదటి ఏఐ ఆధారిత బహుభాషా ఫిర్యాదుల నమోదు**

**యాప్ ను ఆవిష్కరించిన హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్**

పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు భాషా పరమైన ఇబ్బందులు కలగకుండా, వారి ఫిర్యాదులను త్వరితగతిన, కచ్చితత్వంతో నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా ఏఐ కాప్రైటర్ అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్ను అందుబాటులోకి తీసుకువచ్చింది. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీలో శనివారం ఏఐ కాప్రైటర్ యాప్ ను హైదరాబాద్ సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు ఆవిష్కరించారు. దాని పనితీరును పరిశీలించారు. నగరంలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా, బాధితులు తమ మాతృభాషలో చెప్పే ఫిర్యాదులను పోలీసులు తక్షణమే రికార్డు చేసి, అనువదించుకోవచ్చు. హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో తెలుగు, ఇంగ్లీష్ రాని ఇతర రాష్ట్రాల వలస కార్మికులు, పర్యాటకులు ఫిర్యాదు చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భాష అర్థం కాక ఎఫ్.ఐ.ఆర్ నమోదులో జాప్యం జరగడం, సమాచారం తప్పుగా నమోదవ్వడం వంటి సమస్యలకు ఈ యాప్ స్వస్తి పలకనుంది.